వసంత నవరాత్రి ఉత్సవాలు ఆరంభం

రాయదుర్గం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఆదివారం విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సీతారాముల ప్రత్యేక పూజలను స్థానిక లక్ష్మణ్‌బాగ్ మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆదివారం ఆరంభమైన ఈ ఉత్సవాలను ఏప్రిల్ 6వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. అదే రోజు ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలు, కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సుదర్శన్‌నగర్‌లో చలివేంద్రం ప్రారంభం



శేరిలింగంపల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సుదర్శన్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బొల్లారం దేవేందర్ సహకారంతో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చాలనే సంకల్పంతో దాత సహకారంతో రెండో చలివేంద్రాన్ని కాలనీలో ఏర్పాటు చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని వారు వివరించారు. ఆలయ ప్రధాన ట్రస్టీ వెంకటయ్య, సహ ట్రస్టీలు సుధాకర్, శ్రీనివాస్, అరుణ్, కోటేశ్వరరావు, సహాయక సభ్యులు నిర్మల్, యోగీశ్వర్, సారథి, ఉత్తమ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశయాత్ర ఊరేగింపు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఒడిశా బీహార్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున కలశయాత్ర కార్యక్రమం చేపట్టారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన కలశయాత్రలో మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు పాల్గొని మున్సిపల్ వీధుల్లో కలశాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవున జైదుర్గామాత నినాదాలతో వీధులు దద్దరిల్లిలాయి. అనంతరం దుర్గామాత ఆలయంలో మహిళలతో కలిసి చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా కలశయాత్ర చేపడుతున్న మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దీనానాథ్, శ్రీమన్నారాయణ, రాజారాం, మా అంబి మహిళా సేవాసమితి సభ్యులు, పరం, శీలాదేవి, దుర్గావతి, దేవి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

మణికొండ: సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభించామని అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్కాపూర్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అసోసియేషన్‌లో చేరవచ్చని స్వాగతించారు. ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఉగాది పండుగ రోజు శుభ సూచకంగా 750 మందితో అసోసియేషన్‌ను ప్రారంభించామన్నారు. కమ్యూనిటీ వెల్ఫేర్ కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. అల్కాపూర్‌లో ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చిన్న చెరువులో గుర్రపు డెక్క పెరిగిందని, అధికారులు వెంటనే దానిని తొలగిస్తే దోమల బెడద తప్పుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అల్కాపూర్ కాలనీలో భూకబ్జాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

రూ.153.90 కోట్ల బడ్జెట్ ఆమోదం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్యాలయంలో ఆర్థిక సంవత్సరం 2025–26 అంచనా బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి పి.శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆర్థిక సంవత్సరం 2025–26 అంచనా బడ్జెట్‌ను రూ.153.90 కోట్లుగా ప్రత్యేక అధికారి ఆమోదించారు. నెలసరి జీతాలు రూ.8.21 కోట్లు, పారిశుద్ధ్య నిర్వహణ రూ.15.76 కోట్లు, విద్యుత్ బిల్లులు రూ.3.88 కోట్లు, హరిత నిధి రూ.6.36 కోట్లు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.23.57 కోట్లు, సాధారణ పరిపాలన విభాగంలో వివిధ ఖర్చులు రూ.3.56 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగంలో వివిధ ఖర్చులు రూ.0.41 కోట్లు, 1/3 వంతు నిధులు మిగులు వ్యయం రూ.4.35 కోట్లు, ప్రజా సౌకర్యాల ఖర్చులు రూ.6.83 కోట్లు, వార్డు వారీగా వివిధ అభివృద్ధి పనుల ఖర్చులు రూ.79.55 కోట్లుగా ఆమోదించారు.

ఉగాది శోభ

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో నాగదేవతలకు ప్రత్యేక అలంకారం చేసిన దృశ్యం



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో అమ్మవారు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు, అలంకారం వంటివి నిర్వహించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆలయాలను ఉదయమే పూలు, మామిడి ఆకులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరించారు. ఉగాది పర్వదినంతో ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడిని కూడా పలు చోట్ల పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని, స్వామి వార్లను దర్శించుకున్నారు.

– గచ్చిబౌలి/రాయదుర్గం



నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలోని కాశీవిశ్వేశ్వరస్వామి



గోపన్‌పల్లి రంగనాథుడి గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

అన్నమయ్యపురంలో..

మాదాపూర్: చిన్నారి కళాకారులు ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ఆదివారం భగవద్గీత పారాయణం చేసి సందర్శకులను అలరించారు. అనంతరం పెద్దింటి వెంకట భాస్కర సత్యానారాయణచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. సందర్శకులు అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తు వారి రాశుల ఫలితాలను తెలిపారు. అన్ని రాశుల వారు దైవచింతన కలిగివుండాలని కోరారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ శోభరాజు సంస్థ జ్ఞాపికలను అందజేశారు.



మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో జ్ఞాపికలను అందజేస్తున్న సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శోభరాజు

శిల్పారామంలో పంచాంగ శ్రవణం, కూచిపూడి ప్రదర్శన



మాదాపూర్: ఉగాది పండుగను పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సంపాదకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాగి కమలాకర శర్మ పంచాంగ పఠనం చేశారు. ఉగాది పండుగ విశిష్టత, కాలానుగుణంగా మారే రుతువులు వాటి ప్రభావాలు, ద్వాదశరాశుల ఆదాయ వ్యయాలు, సంవత్సర ఫలితాలు, పరిహారాలను వివరించారు. శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పంచాంగ కర్తని ఘనంగా సత్కరించారు. అనంతరం అపర్ణధూళిపాళ్ళ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో వినాయకస్తుతి, నీలిమేఘ శరీర, బృందావన సారంగి తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులు ఆరుషి, శ్రీనిక, యామిని, సురభి, అనన్య, నిత్యశ్రీ, శ్రీకృతి పాల్గొని ప్రదర్శించారు.



కమలాకర శర్మ

ఆలయాల్లో పంచాంగ శ్రవణం

రాయదుర్గం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో పంచాంగశ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని జీపీఆర్ఏ క్వార్టర్స్, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, రాయదుర్గం, గౌలిదొడ్డి, గోపన్‌పల్లితాండ, ఖాజాగూడ,ఇందిరానగర్, కొత్తగూడ, కొండాపూర్ వంటి ప్రాంతాలలో ఆలయాల్లో వివిధ రాశుల పరిస్థితిని భక్తులకు అర్చకులు వివరించారు. రాష్ట్రంలో అన్ని రకాల పరిస్థితులను కూడా వివరించారు.



శేరిలింగంపల్లి డీసీగా ప్రశాంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వి.ప్రశాంతి నియమితులయ్యారు. జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెకు శేరిలింగంపల్లి సర్కిల్‌కు జీహెచ్‌ఎంసీ కమిషనర్ పోస్టింగ్ ఆదివారం ఇచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.ముకుంద్‌రెడ్డి పదవీ విరమణతో నియామకం చేపట్టారు.

మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ నాయకురాలు సాక్షి

పటాన్‌చెరు: ఏప్రిల్ 4,5 తేదీల్లో జోగిపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు సాక్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు నినాదంతో ఎస్ఎఫ్ఐ అనునిత్యం విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. విద్య రంగం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మహాసభ చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు ప్రాంత విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అదనపు తరగతి గదులు నిర్మించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని పూర్వ పాఠశాల సముదాయంలో తరగతి అదనపు గదులను నిర్మించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. అదనపు గదులను నిర్మిస్తే విద్యార్థులకు దూరభారం తగ్గుతుందని, ఇక్కడే చదువులు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతాప్ రెడ్డి, ప్రదీప్ గౌడ్, సుధాకర్, ప్రవీణ్, రాములు, యాదగిరి, నర్సిం లు, అశోక్ పాల్గొన్నారు.

గోపన్‌పల్లి ప్రజల ఆరాధ్యదైవం రంగనాథస్వామి





గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి వారికి మహాభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

రాయదుర్గం: గోపన్‌పల్లి ప్రజల ఆరాధ్యదైవమైన రంగనాథస్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలు, మామిడిఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆ తర్వాత ఉదయం ఆలయంలో రంగనాథస్వామి వారికి అర్చకుల పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో మహాభిషేకం నిర్వహించారు. తర్వాత గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే ఆధ్వర్యంలో భాజాభజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి అర్చకులు అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు.

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గోపన్‌పల్లి పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్యదైవం రంగనాథస్వామి అని అన్నారు. రెండు రోజుల పాటు సాగే ఉత్సవాలలో ఉగాది పర్వదినం రోజున ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అదే ఆనవాయితీని తాము కొనసాగిస్తున్నామని తెలిపారు. స్థానిక భక్తులు, ఆలయ కమిటీ, అర్చకులు సమష్టిగా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఓటీఎస్ పథకం

జిన్నారం (పటాన్‌చెరు): ఈ నెల 31 తో ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం ముగియనుందని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సైతం అధికారులు అందుబాటులో ఉండి పన్నులు వసూలు చేశారు. పారిశ్రామికవేత్తలు, గృహ యజమానులు ముందుకు వచ్చి 90% వడ్డీ రాయితీతో పనులు చెల్లించారు. మెడ్రిచ్ లిమిటెడ్ పరిశ్రమ రూ.5,93,280 , ఎస్టీ స్టీల్ ఇండస్ట్రీస్ రూ.1,82,002, విజేత ఎంటర్‌ప్రైజెస్ రూ.3,01,898 ఆస్తి పన్ను బకాయిలను చెక్కు రూపంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డిని కలిసి అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ...ఇప్పటివరకు 13.75 కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేశామన్నారు.

ఆకట్టుకున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించాలని కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానవ సేవే మాధవ సేవ



లింగంపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్

రాయదుర్గం: వేసవిని దృష్టిలో పెట్టుకొని సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్, డాక్టర్ బీసీరామన్న చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సత్యసాయిసేవా సమితి మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతి వేసవికాలంలో పాదచారులు, వాహనదారు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తుందని గుర్తు చేశారు. చలివేంద్రాలు పాదచారులు, వాహనదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయిసేవాసమితి సభ్యులు రాహుల్, డివికృష్ణారావు, సుబ్బారావు, ప్రదీప్, వినయ్, శశికిరణ్, రామ్మోహనరావు, ఉషారాణి, నీలిమా దామోదర్‌రెడ్డి, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు...

శేరిలింగంపల్లి: పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రవికుమార్ యాదవ్ తెలిపారు. లింగంపల్లి రైల్వే స్టేషన్, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కాంటెస్టెడ్ కార్పొరేటర్ కె.ఎల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను రవికుమార్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. వేసవిలో దహార్తిని తీర్చేందుకు వీలైనన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ అధ్యక్షుడు కిషోర్ ముదిరాజ్, నాయకులు సోమయ్య యాదవ్, రమేష్, శ్రీను, నరసింహ, రాజేష్, నర్సింగ్‌యాదవ్, నీలకంఠారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో చలివేంద్రాన్ని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

ముగిసిన 'బర్డ్స్ ఐ వ్యూ'చిత్ర ప్రదర్శన



మాదాపూర్: యువ, అభివృద్ధి చెందుతున్న కళాకారుల కోసం నిధులు సమీకరించేందుకు బన్యాన్ ఆర్ట్ స్టూడియో ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్న 'బర్డ్స్ ఐ వ్యూ'చిత్ర ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. 40 మంది కళాకారులు వేసిన 100కి పైగా చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేక కళాకృతులతో పాటు అరుదైన సేకరణలు ప్రదర్శించారు.



ఉచిత మెగా వైద్య శిబిరం

మణికొండ: కాదంబరి ఫౌండేషన్–మనం సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షుర్ సంస్థ వారి సీఎస్ఆర్ సౌకర్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలోని ఎల్ఐజీ ప్రాంగణంలో రెనోవా హాస్పిటల్ విద్యానగర్ వారి సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి, దంత, బీపీ, హార్ట్, బీఎంఐ, కేన్సర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నటుడు వినోద్‌బాల, ఎల్ఐజీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, పలువురు నటీనటులు, వివిధ శాఖల సినీ కార్మికులు పాల్గొన్నారు.

4 నుంచి రాములోరి ఉత్సవాలు

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: ఏప్రిల్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శ్రీరామనవమి నేపథ్యంలో ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ లగ్నపత్రిక రాయించి, 6న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణ ముహూర్తంను వేద పండితులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అల్లాడి శ్రీనివాసరావు, నరసింహచారి, శ్రీనివాస్‌చారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జలగరి ఎట్టయ్య , పోచారం కృష్ణయ్య పాల్గొన్నారు.



వేద పండితులతో సమావేశమైన కార్పొరేటర్

ఈద్గాల వద్ద భారీ ఏర్పాట్లు

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- మసీదుల మౌలిక వసతులు కల్పిస్తున్నాం
- ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు



మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని ఈద్గా వద్ద చేపట్టిన పనులను ముస్లింలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రార్థనలు చేసుకోవాడానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించామని తెలిపారు. ముస్లింలు సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలని అన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన గంగ–జమున–తెహజీబ్ మరింతగా పరిఢవిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, ఖాసీం, అక్కారవు, బృందరావు, సత్యం గుప్తా, సయ్యద్ రిజ్వాన్, కాజా, మియన్ పటేల్, బాబుమియా, ఉమ, రాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యనగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మసీదులకు నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు: జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: ఆదిత్యనగర్‌లో ఉన్న ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్యనగర్‌లోని ఈద్గా వద్ద ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. చెత్తా చెదారం ప్రతిరోజు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య సంబంధించిన అధికారులకు తెలియజేశారు. మసీదులకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పరకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని అన్నారు. ముస్లింలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ గౌడ్, సాజిద్, నగేష్ నాయక్, మునాఫ్ ఖాన్, రహీం, ముక్తార్, అఖిల్, హనీఫ్, ఇస్మాయిల్, లతీఫ్, సాహెల్, ఇమ్రాన్, హమీద్, రిజ్వాన్ కమిటి సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.